క్లుప్తంగా

గో సంరక్షణ నిధికి విరాళం



విరాళానికి సంబంధించిన బాండును దాతలకు అందజేస్తున్న ఆలయాధికారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలశ్రీభ్రమరాంబామల్లికార్జునస్వామివార్లదేవస్థానం నిర్వహిస్తున్న గో సంరక్షణ నిధికి గురువారం హైదరాబాద్‌కు చెందిన టి వెంకట గిరిధర్‌రెడ్డి రూ.1,01,116 లు విరాళంగా అందజేశారు.ఈ విరాళాన్ని అధికారులకు అందజేయగా, వారు దాతలకు స్వామివార్ల శేషవస్త్రాలు, లడ్డూప్రసాదాలు, విరాళానికి సంబంధించిన బాండును అందజేశారు.

అన్నప్రసాద వితరణ పథకానికి ..

శ్రీశైలదేవస్థానం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి గురువారం విజయవాడకు చెందిన శ్రీనివాస అరవింద రూ.1,01,116లు విరాళంగా అందజేశారు. ఈ విరాళాన్ని విరాళాల కేంద్రంలోని అధికారులకు అందజేయగా, వారు దాతలకు స్వామివార్ల శేషవస్త్రాలు, లడ్డూప్రసాదాలు, విరాళానికిసంబంధించిన బాండును అందజేశారు.

బాపనంతపురంలో వైద్యశిబిరం

ఆత్మకూరు: మండలంలోని బాపనంతపురం గ్రామంలో గురువారం ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ కార్యక్రమంలో భాగంగా గురువారం ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. వైద్యాధికారి పవన్‌కుమార్ మాట్లాడుతూ గ్రామాల్లో అంటురోగాలు దరిచేరకుండా పారిశుద్ధ్య పనులు చేపట్టాలన్నారు. గ్రామంలో బీపీ, షుగర్, గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బైర్లూటి వైద్య సిబ్బంది ఝాన్సీరావు, బేగం, భాస్కర్, రవి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సదరం క్యాంపు స్లాట్ బుకింగ్

వెలుగోడు: ఈ ఏడాది తొలి మూడు నెలలకు సంబంధించిన సదరం క్యాంపులకు శుక్రవారం నుంచి స్లాట్లు విడుదల చేస్తున్నట్లు ఎంపీడీఓ షేక్ అమానుల్లా తెలిపారు. ఈ నెల 6 నుంచి మార్చి వరకూ దివ్యాంగులు స్లాట్లను బుక్ చేసుకోవచ్చని చెప్పారు. మరోవైపు గతేడాది డిసెంబరు 31 వరకు ఇచ్చిన స్లాట్ల సమయం ముగిసినందున అప్పటివరకు స్లాట్లు తీసుకుని, వినియోగించుకోని వారికి మరోసారి స్లాట్ బుక్ చేసుకునేందుకు అవకాశం కల్పించినట్లు చెప్పారు. స్లాట్ బుక్ చేసుకున్న వారికి నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో స్క్రీనింగ్ పరీక్షలు ఉంటాయని చెప్పారు.

టీబీ సర్వేలో ప్రమాణాలు పాటించాలి



సర్వే వివరాలు తెలుసుకుంటున్న ఎస్ఎస్‌సీ ధ్రువీకరణ జిల్లా అధికారి డాక్టర్ విజయకుమారి

పాములపాడు: టీబీ సర్వేలో ప్రమాణాలు పాటించాలని జిల్లా ఎస్ఎస్‌సీ ధ్రువీకరణ అధికారిణి డాక్టర్ విజయకుమారి అన్నారు. మండలంలోని ఇస్కాల గ్రామంలో జరుగుతున్న టీబీ సర్వేను గురువారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బందితో కలిసి గ్రామంలో పర్యటించారు. ఆమె మాట్లాడుతూ సెంట్రల్ టీబీ డివిజన్ ఢిల్లీ వారు సబ్‌నేషనల్ సర్టిఫికెట్ (ఎస్ఎస్‌సీ) సర్వే నిర్వహిస్తున్నారన్నారు. అందులో భాగంగా నంద్యాల జిల్లాలో 10 బృందాలు వివిధ ప్రాంతాల్లో ఈ సర్వేను నిర్వహిస్తున్నాయని చెప్పారు. ఇస్కాల గ్రామంలో 602 గృహాలు పూర్తి చేశారని, 29 గళ్ల నమూనాలు పరీక్ష చేశారని వివరించారు. టీబీ సూపర్‌వైజర్లు రవి కుమార్, మస్తానయ్య, ఉపేంద్ర, యంఎల్‌హెచ్‌పీ సింధూర తదితరులు పాల్గొన్నారు.

18న మహానందిలో టెండర్లు

మహానంది: మహానందిలో శివరాత్రి ఏర్పాట్లకు సంబంధించి టెండర్లు నిర్వహించనున్నట్లు ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 18వ తేదీన టెండర్లు ఉంటాయన్నారు. విద్యుద్దీపాలంకరణ, పార్కింగ్ ఏర్పాట్లు, ఇతర అంశాలకు టెండర్లు నిర్వహిస్తామన్నారు.

ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు



ప్లాస్టిక్ వ్యర్థాలను తగులబెడుతున్న దృశ్యం

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు అటవీ డివిజన్ పరిధిలోని వెలుగోడు రేంజ్‌లోని నార్త్ బీట్‌లో అటవీ శాఖ సిబ్బంది గురువారం పెద్ద ఎత్తున ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి తగుల బెట్టారు. ఈ ప్రాంతంలోని ఆత్మకూరు - వెలుగోడు ప్రధాన రహదారికిరువైపులా ప్రయాణికులు విసిరి వేసే ప్లాస్టిక్ కవర్లు, రేపర్లు పేరుకు పోయాయి. ఇవి వన్య ప్రాణులకు హాని కలిగించే స్థాయికి వెళ్లడంతో టైగర్ ప్రాజెక్ట్ డిప్యూటీ డైరెక్టర్ అలెన్ చోంగ్ టిరాన్ ఆదేశాల మేరకు వెలుగోడు రేంజ్ అధికారులు ఈ కార్యక్రమం చేపట్టారు.

సంక్షేమ పథకాలే మళ్లీ గెలిపిస్తాయి

- రాబోయే ఎన్నికలతో చంద్రబాబుకు రాజకీయంగా నామరూపాలుండవు
- పింఛన్ల వారోత్సవాల్లో ఎమ్మెల్యే తొగురు ఆర్థర్



నందికొట్కూరులో లబ్ధిదారుడికి పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే ఆర్థర్, మున్సిపల్ చైర్మన్ సుధాకర్‌రెడ్డి

జూపాడుబంగ్లా(నందికొట్కూరు): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలే ఆయనను మళ్లీ ముఖ్యమంత్రి చేస్తాయని, రాబోయే ఎన్నికలతో చంద్రబాబునాయుడు రాజకీయంగా నామరూపాల్లేకుండా పోతారని నందికొట్కూరు ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ అన్నారు. పింఛన్ల వారోత్సవాల్లో భాగంగా గురువారం నందికొట్కూరు జైకిసాన్ పార్కులో పెంచిన, నూతన పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. నందికొట్కూరు మున్సిపల్ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, వైస్ చైర్మన్లు మొల్లా రబ్బాని, ప్రశాంతిలతో కలిసి పింఛన్లను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. టీడీపీ పాలనలో పచ్చచొక్కాలు వేసుకున్న వారికి మాత్రమే పథకాలు అందేవన్నారు. జగనన్న సీఎం అయ్యాక అర్హత ఉంటేచాలు పార్టీలకు అతీతంగా అందరికీ సంక్షేమ పథకాలిచ్చారని చెప్పారు. మూడేళ్ల కాలంలో ఆయన మెనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో 90శాతం నెరవేర్చిన ఏకైక సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. మెనిఫెస్టో హామీలేకాక 45శాతం ఇవ్వని హామీలను కూడా నెరవేర్చారని తెలిపారు. ఇచ్చిన మాట మేరకు ప్రతి ఏటా రూ.250ల చొప్పున పింఛన్ మొత్తాన్ని పెంచుతున్నారన్నారు.

ఇంటివద్దకే పింఛన్..

ప్రతి నెల ఒకటో తేదీన తెల్లవారకముందే వలంటీర్లు తలుపుతట్టి అవ్వా, తాత, అక్కా, చెల్లెమ్మల చేతుల్లో పింఛన్ సొమ్ము అందజేస్తుండటంతో వారి ఆనందం వర్ణనాతీతమన్నారు. టీడీపీ పాలనలో పింఛన్ సొమ్ము పొందాలంటే ఐదు, ఆరురోజులు పంచాయతీ కార్యాలయాల వద్ద తిండీతిప్పలు మానుకొని పడిగాపులు కాయాల్సివచ్చేదన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కిషోర్, రాష్ట్ర ఉర్దూ అకాడమి డైరెక్టర్ హాజి అబ్దుల్ షుకూర్, తహసీల్దార్ పుల్లయ్యయాదవ్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఉండవల్లి ధర్మారెడ్డి, జాకీర్‌హుసేన్, తమడపల్లి విక్టర్, పట్టణ మహిళా ప్రధాన కార్యదర్శి డాక్టర్ వనజ, రిటైర్డ్ ఎస్ఐ జాన్, మాజీ కౌన్సిలర్ దేశెట్టి శ్రీనివాసులు, నాయకులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే జగనన్న ఊపిరి

పగిడ్యాల: పేదల సంక్షేమమే ఊపిరిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగుతోందని ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ అన్నారు. వైఎస్సార్ పింఛన్ కానుక వారోత్సవాలలో భాగంగా గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద సర్పంచ్ పెరుమాళ్ల శేషన్న అధ్యక్షతన కొత్త పింఛన్‌ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. మండలానికి మంజూరైన 104 కొత్త పింఛన్‌లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల ఎంపీడీఓ వెంకటరమణ, తహసీల్దార్ భారతీ, ఎంఈఓ సుభాన్, ఈఓఆర్డీ పుల్లయ్య, జెడ్పీటీసీ పుల్యాల దివ్య, ఎంపీపీ మండ్ల మల్లేశ్వరి, ఎంపీటీసీ పగడం గోపాల్, సర్పంచ్‌లు రాజేశ్వరి, ప్రభాకర్‌రెడ్డి, పిట్టల శేషమ్మ, పంచాయతీ కార్యదర్శులు ఉపేంద్రారెడ్డి, సమతయశోదర, జావేద్, వీరన్న యాదవ్, మల్లికార్జున, కోట్ల వెంకటేష్, శ్వేత, మంజులవాణి తదితరులు పాల్గొన్నారు.

బాబు పాలనలో సంక్షేమం కనుమరుగు

మిడుతూరు: గత టీడీపీ పాలనలో చావు కేకలే తప్ప సంక్షేమం కానరాలేదని ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో గ్రామ సర్పంచ్ జయలక్ష్మమ్మ ఆధ్వర్యంలో పింఛన్ల వారోత్సవాలు నిర్వహించారు. మండలంలో కొత్తగా మంజూరైన 205 పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జీఎన్ఎస్ రెడ్డి, తహసీల్దార్ సిరాజుద్దిన్, ఎంపీపీ మల్లు వెంకటేశ్వరమ్మ, ఉర్దూ రాష్ట్ర అకాడమి డైరెక్టర్ అబ్దుల్ షుకూర్, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ తువ్వా శివరామకృష్ణారెడ్డి, సర్పంచ్‌లు భారతి, కృష్ణవేణి, ఇందిరమ్మ, రామస్వామిరెడ్డి, మదార్‌సాహెబ్, వెంకటేశ్వర్లు, రామచంద్రుడు, చంద్రశేఖర్‌రెడ్డి, ఉప సర్పంచ్ తువ్వా లోకేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు గోవర్ధన్‌రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, ఇనాయతుల్లా, మహేష్, సాదిక్‌బాషా, సీతారాముడు తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లికి రూ.2.86 కోట్లు మంజూరు

కొత్తపల్లి: జలజీవన్ మిషన్ కింద మండలానికి రూ.2.86 కోట్లు మంజూరైనట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ త్రిలింగేశ్వర రెడ్డి గురువారం తెలిపారు. ఈ మిషన్ ద్వారా ఇంటింటికీ కుళాయి కనెక్షన్, వాటర్‌ట్యాంకుల మరమ్మతులు, అవసరమైన గ్రామాలలో కొత్త నీటి ట్యాంకుల నిర్మాణాలను చేసుకోవచ్చన్నారు. వీటికి టెండర్లు పూర్తిఅయిన వెంటనే పనులు ప్రారంభిస్తామని వివరించారు.

12న జాబ్‌మేళా

శ్రీశైలంప్రాజెక్ట్: జిల్లా ఉపాధి కల్పనశాఖ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్ ఆధ్వర్యంలో ఈ నెల 12న నంద్యాల పట్టణంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి సోమశివారెడ్డి, సీడాప్ అధికారి కిరణ్, కళాశాల ప్రిన్సిపల్ శశికళ, స్కిల్‌డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధికారి పీవీ ప్రతాప్‌రెడ్డి గురువారం ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు. 13 జాతీయ కంపెనీలతో జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని, నిరుద్యోగ యువతీయువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. నంద్యాలలోని పీఎస్‌సీ అండ్ కేవీఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీకళాశాలలో 12న ఉదయం 9.30 గంటలకు జాబ్‌మేళా ప్రారంభమవుతుందని ఆయన తెలిపారు. 10వ తరగతి పాస్ అయిన అభ్యర్థులు మొదలుకుని, ఇంటర్ , డిప్లొమో, డిగ్రీ, బీటెక్, పీజీ చదివిన విద్యార్థులు ఈ జాబ్‌మేళాలో పాల్గొని ఉద్యోగ అవకాశాలు పొందాలన్నారు.

సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శం



పింఛన్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ ఉషారాణి

మిడుతూరు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన గ్రామ సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శమని నాగలూటి గ్రామ సర్పంచ్ ఉషారాణి తెలిపారు. గురువారం మండలంలోని నాగలూటి గ్రామంలో గ్రామసచివాలయ ప్రథమ వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. అలాగే గ్రామానికి మంజూరైన నూతన పింఛన్లను పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, వలంటీరు, సచివాలయ, ఆర్బీకేల వ్యవస్థలను ఇతర రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకొని అక్కడ అమలు చేయటానికి యత్నిస్తున్నారని తెలిపారు. అనంతరం నూతన లబ్ధిదారులకు నూతన పింఛన్లన పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు నబీరసూల్, కార్యదర్శి సుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు నబిరసూల్, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఇంటి ముంగిటకే సంక్షేమ ఫలాలు

- పథకాలతో పేదల్లో ఆనందం
- శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి
- గాజులపల్లెలో 'గడప గడపకు మన ప్రభుత్వం'



మహిళకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

మహానంది: ఎక్కడా పైసా అవినీతి లేకుండా పేదల ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు అందిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన దేశానికే ఆదర్శంగా నిలిచిందని శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. గాజులపల్లెలో గురువారం రెండో రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పథకాలతో పేదలు ఆనందంగా ఉన్నారని చెప్పారు. గతంలో పింఛను రావాలంటే గ్రామంలో ఎవరో ఒకరు మరణిస్తేనే ఇచ్చేవారన్నారు. కానీ నేడు అర్హత ఉంటే చాలు ఎలాంటి సిఫారసులు, ఖర్చు లేకుండా పింఛను అందిస్తూ పేదలకు ఆర్థికంగా అండగా నిలుస్తున్నారన్నారు. ఏ గ్రామానికి వెళ్లినా, గడపగడపలో ప్రజలు ఆశీర్వదిస్తున్నారని, మళ్లీ మా జగనన్న ముఖ్యమంత్రి అయితేనే ఈ పథకాలన్ని వస్తాయని స్వచ్ఛందంగా వారే చెబుతున్న మాటలే అవినీతి లేని పాలనకు నిదర్శనమన్నారు. కార్యక్రమంలో శ్రీశైలం నియోజకవర్గ సమన్వయకర్త శిల్పా భువనేశ్వరరెడ్డి, గోపవరం సొసైటీ చైర్మన్ గాజులపల్లె కిట్టు, గ్రామ సర్పంచ్ గడ్డం చంటి, ఎంపీటీసీ చౌటుపల్లి నరసింహుడు, తహసీల్దార్ జనార్దన్‌శెట్టి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శివనాగజ్యోతి, వైఎస్సార్‌సీపీ నాయకులు కొండా మధుసూదన్‌రెడ్డి, గజ్జా పెద్ద పక్కీరయ్య, నరసింహుడు, నాయకులు పాల్గొన్నారు.

12 ఏళ్ల సమస్య పరిష్కారం

భర్త మృతి చెందినా పింఛను రాలేదని గాజులపల్లె మదార్‌బీ ఆవేదన వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి దృష్టికి తీసుకెళ్లింది. స్పందిన ఎమ్మెల్యే శిల్పా అధికారులతో మాట్లాడి మరణ ధ్రువీకరణ పత్రంతో పాటు పెన్షన్ మంజూరు చేయించడంతో ఆమె ఆనందం వ్యక్తం చేసింది. గాజులపల్లె జెడ్పీ పాఠశాలలో విద్యార్థులకు మూడు చక్రాల సైకిళ్ల, వినికిడి మిషన్లు పంపిణీ చేశారు.

ప్రయాణికులకు మెరుగైన సేవలందించాలి



బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తొగురు ఆర్థర్

జూపాడుబంగ్లా(నందికొట్కూరు): ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించటం ద్వారా ఆర్టీసీ ఆదాయాన్ని రెట్టింపు చేసుకోవాలని నందికొట్కూరు ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ సూచించారు. గురువారం నందికొట్కూరు ఆర్టీసీ డిపోలో నందికొట్కూరు-కర్నూలుకు రెండు హెయిర్‌విత్ బస్సులను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఆయన ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలోని తాగునీటి వసతి, టాయ్‌లెట్లు, క్యాంటీన్‌లను పరిశీలించారు. బస్టాండులో దివ్యాంగుడిని పలుకరించిన అతని వివరాలు తెలుసుకొని ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ నాగేశ్వరరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ మొల్ల రబ్బాని, వైఎస్సార్‌సీపీ నాయకులు జాకీర్‌హుసేన్, ఉండవల్లి ధర్మారెడ్డి, తమ్మడపల్లి విక్టర్, జాన్, ముజీబ్, దేశెట్టి శ్రీనివాసులు, ఆర్టీసి సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రంలో విద్యాభివృద్ధికి పెద్దపీట



విద్యార్థులకు ట్యాబులు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీడీఓ, ఎంఈఓ

జూపాడుబంగ్లా: విద్యాభివృద్ధికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని జెడ్పీటీసీ సభ్యుడు పోచా జగదీశ్వరరెడ్డి, ఎంపీపీ సువర్ణమ్మ, ఎంపీడీఓ మంజులవాణి, ఎంఈఓ మోహన్ తెలిపారు. గురువారం జూపాడుబంగ్లా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం మోహన్ అధ్వర్యంలో 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ నాడు-నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులను కల్పించి కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దడం అమోఘమన్నారు. అలాగే అమ్మఒడి పథకం, విద్యాకానుక, విద్యాదీవెన, వసతిదీవెన వంటి అనేక పథకాలను ప్రవేశపెట్టి విద్యావ్యవస్థలో సమూలమైన మార్పులు చేసి గ్రామీణ విద్యార్థులకు సైతం ఆధునిక విద్య అందించేలా చేశారన్నారు. కార్యక్రమంలో పీఎంసీ చైర్మన్ ప్రమీలమ్మ, ఉపాధ్యాయులు అజీం, లక్ష్మన్న, మద్దయ్య, సలీమాబేగం తదితరులు పాల్గొన్నారు.

నూతన పింఛన్ల పంపిణీ

మండలకేంద్రమైన జూపాడుబంగ్లా గ్రామంలోని రెండు సచివాలయాల పరిధిలో మంజూరైన 21నూతన పింఛన్లను గురువారం సర్పంచ్ మొట్టె బాలస్వామి చేతులమీదుగా పంపిణీ చేశారు. రెండు సచివాలయాల పరిధిలో ఇప్పటికే 729 పింఛన్లు ఉండగా కొత్తగా 21 మంజూరైనట్లు సచివాలయ ఉద్యోగులు తెలిపారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న టీఎస్ జెన్‌కో అధికారులు

శ్రీశైలంప్రాజెక్ట్: తెలంగాణ ఎలక్ట్రిసిటీ స్టాఫ్, వర్కర్స్ యూనియన్ హెచ్ 64 నూతన సంవత్సర క్యాలెండర్‌ను గురువారం విడుదల చేశారు. టీఎస్ జెన్‌కో చీఫ్ ఇంజినీర్ కార్యాలయం శక్తి భవన్‌లో చీఫ్ ఇంజినీర్ సూర్యనారాయణ, ఎస్ఈలు ఆదినారాయణ, రవీంద్ర కుమార్, ఏడీఈ నారాయణ రెడ్డిలు క్యాలెండర్లను ఆవిష్కరించారు. యూనియన్ నాయకులు కె .నాగిరెడ్డి, డి.ఓబులయ్య, బి.లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

వెలుగోడు: యూటీఎఫ్ డైరీ, క్యాలెండర్‌ను ఎంఈఓ బ్రహ్మంనాయక్ ఆవిష్కరించారు. గురువారం స్థానిక ఎంఆర్‌సీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉపాధ్యాయులతో కలిసి ఎంఈఓ డైరీలు, క్యాలెండర్లు ఆవిష్కరించి ఆ సంఘం నాయకులను అభినందించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సామన్న, రఫీ, కోశాధికారి సుబ్రహ్మణ్యం, సహధ్యక్షుడు జాకీర్ హుస్సేన్, కార్యదర్శి ఫకీర్ అహమ్మద్ పాల్గొన్నారు.

పీఆర్టీయూ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

పాములపాడు: స్థానిక ఎమ్మార్సీ భవనంలో పీఆర్టీయూ డైరీ, క్యాలెండర్‌ను ఎంఈఓ బాలాజీనాయక్ గురువారం ఆవిష్కరించారు. ఉపాధ్యాయులందరికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. వానాల హెచ్ఎం రవికుమార్, పీఆర్టీయూ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చాంద్‌బాషా, మండల అధ్యక్ష, మధుసూదన్‌రెడ్డి, రమణయ్య పాల్గొన్నారు.

అనుమతులు లేని స్టాక్ విక్రయాల నిలుపుదల



ఫర్టిలైజర్ దుకాణంలో రిజిష్టర్లను పరిశీలిస్తున్న ఏడీఏ ఆంజనేయ

పగిడ్యాల: స్థానిక సహకార సొసైటీ, మల్లికార్జున ఫర్టిలైజర్స్ ఎరువుల దుకాణంలో అనుమతులు లేకుండా నిల్వ ఉన్న స్టాక్‌ను విక్రయించకుండా నిలుపుదల చేసినట్లు ఆత్మకూరు ఏడీఏ ఆంజనేయ తెలిపారు. గురువారం ఆయన ఎరువుల దుకాణాలను ఆకస్మిక తనిఖీ చేపట్టారు. స్టాక్, సేల్స్ రిజిష్టర్‌లను పరిశీలించగా అనుమతులు లేకుండా మల్లికార్జున ఫర్టిలైజర్ దుకాణంలో రూ. 4.21 లక్షల జిప్సం ఎరువు, సహకార సొసైటీలో రూ. 9.44లక్షల విలువ చేసే డీఏపీ స్టాక్‌ను గుర్తించి విక్రయించి నిలుపుదల చేశామని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా ఎరువుల దుకాణ యజమానులు స్టాక్‌ను నిల్వ చేస్తే లైసెన్స్‌లను రద్దు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట మండల వ్యవసాయ అధికారి విజయ్‌జ్యోతుకుమార్ తదితరులు ఉన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

మిడుతూరు: మండల పరిధిలోని తలముడిపి గ్రామ పొలిమేరల్లో 11 మంది పేకాట ఆడుతుండగా పోలీసులు దాడిచేసి పట్టుకున్నారు. వారి నుంచి దాదాపు రూ. 25,360 నగదు, మోటార్ సైకిళ్ల స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ మారుతిశంకర్ గురువారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు గడివేముల, తలముడిపి, గడిగరేవుల, చిందుకూరు, మంచాలకట్ట, బూజనూరు గ్రామాలకు చెందిన 11 మందిని అరెస్టు చేశామన్నారు.

8న జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు

జూపాడుబంగ్లా: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని ఈనెల 8న జూపాడుబంగ్లాలో ఉమ్మడి కర్నూలు జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పోటీల్లో పాల్గొనదలచిన వారు ఈనెల 7న సాయంత్రం ఐదు గంటల్లోగా రూ.500ల ప్రవేశరుసుము చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. పోటీల్లో గెలుపొందిన వారికి వరుసగా రూ.25,016, రూ.15,016, రూ.8,016, రూ.4,016 నగదు బహుమతి అందజేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు సెల్ నెంబర్: 7337581448కు ఫోన్‌చేసి పేర్లు నమోదు చేయించుకోవాలని కోరారు.

బీమా సాయం అందజేత

వెలుగోడు: మోతుకూరు గ్రామానికి చెందిన జి.మల్లికార్జున(40) గురువారం మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబానికి ఎంపీడీఓ షేక్ అమానుల్లా వైఎస్సార్ బీమా కింద రూ.10 వేలు అంత్యక్రియల నిమిత్తం అందించారు. మిగతా సొమ్మును త్వరలోనే బాధిత కుటుంబానికి అందిస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి నాగరాజు, వెల్ఫేర్ అసిస్టెంట్ జగదీష్ పాల్గొన్నారు.

బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శిగా నాగేశ్వరరావు

వెలుగోడు: భారతీయ జనతా యువ మోర్చా (బీజేవైఎం) నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శిగా నూలు నాగేశ్వరరావును ఎన్నుకున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు చైతన్య కుమార్ తెలిపారు. గురువారం నూతన కమిటీని ఏర్పాటు చేసినట్లు ఆయన వెల్లడించారు. తనను జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎంపిక చేయడం పట్ల రాష్ట్ర అధ్యక్షుడు సురేంద్ర మోహన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బైరెడ్డి శబరికి నాగేశ్వరరావు కతజ్ఞతలు తెలిపారు.

9న టెంకాయల వేలం

బండిఆత్మకూరు: మండల పరిధిలోని ఓంకార క్షేత్రంలో టెంకాయల విక్రయానికి ఈ నెల 9న వేలంపాట నిర్వహిస్తున్నట్లు ఈఓ మోహన్ గురువారం తెలిపారు. అలాగే పాదరక్షలు, కూల్‌డ్రింక్స్, ఐసు బండ్ల వ్యాపారం చేసుకోవడానికి కూడా వేలం నిర్వహిస్తున్నామన్నారు. ఆసక్తి ఉన్నవారు రూ. 10 వేలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనవచ్చన్నారు.

గోదాదేవిని స్మరిస్తే స్వామికి ఆనందం

నంద్యాల(వ్యవసాయం): గోదాదేవి అమ్మవారిని కీర్తిస్తే శ్రీకృష్ణ భగవానుడికి ఆనందం కలుగుతుందని గోపికలతో చెప్పే విధానాన్ని డాక్టర్ హయగ్రీవాచారి భక్తులకు వివరించారు. గురువారం శ్రీభగవత్ సేవా సమాజ్ టీటీడీ ఆల్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్టు ఆధ్వర్యంలో తిరుప్పావై ప్రవచనాలు వినిపించారు.

'బీజేపీకి గుణపాఠం తప్పదు'

ఆత్మకూరు: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ధనవంతులకు కొమ్ముకాస్తు పేదల సంక్షేమాన్ని విస్మరించిందని, ఆ పార్టీకి బుద్ధి చెబుతాదని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఏసురత్నం, పట్టణ కార్యదర్శి రణధీర్ అన్నారు. పట్టణంలోని ధనుంజయ మీటింగ్ హాల్‌లో గురువారం ఆ పార్టీ కార్యకర్తల సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తుందని, కుల, మతాలతో ప్రజలకు చీల్చి ఓట్ల రాజకీయాలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు మంజుల, మీనాక్షి, సురేంద్ర, రామ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు

జూపాడుబంగ్లా: మిరపలో కొద్దిపాటి సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడులు సాధించవచ్చని తంగడంచ ఆర్బీకే హార్టికల్చర్ అసిస్టెంటు వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం తంగడంచ గ్రామంలోని మిరపతోటలో మనతోట బడి కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మిరప సాగుచేసిన రైతులు పంటలో పురుగుల వ్యాప్తిని నివారించేందుకుగాను పసుపు, నీలం, తెలుపు కలర్ల 25 జిగురు అట్టలను ఏర్పాటుచేసుకోవాలని సూచించారు. అలాగే పొలం చుట్టూ నాలుగు గేట్ల వెంట బంతిపూలు (చెండుపూలు) సాగుచేసుకోవటం వల్ల పురుగులు అధికంగా వాటిపై గుడ్లు పెడతాయన్నారు. తద్వారా మిరప పంటలో పురుగుల వ్యాప్తి తగ్గుతుందని తెలిపారు. అలాగే నల్లతామర పురుగు నివారణకుగాను ఎప్పటికప్పుడు వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటిస్తూ తగిన మోతాదులో రసాయనిక మందులు పిచికారీ చేసుకోవాలని సూచించారు.

మెనూ పాటించాలి

కొత్తపల్లి: పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని మెనూ ప్రకారం అందించాలని ఎంపీడీఓ మేరి సూచించారు. గురవారం మండల పరిధిలోని ముసలిమడుగు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. భోజనం నాణ్యతపై విద్యార్థులను ఆరా తీశారు. ప్రతి రోజు మెనూప్రకారం భోజనం ఇస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం సచివాలయ సిబ్బందితో సమావేశమై ఎస్‌డీజీ సర్వేను, ఆయూష్మాన్ భారత్ కార్డుల రిజిస్ట్రేషన్, హౌసింగ్ రిజిస్ట్రేషన్, ఆన్‌లైన్ జియోట్యాగింగ్ ప్రక్రియలను త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ శ్రీనివాసులు నాయుడు, సర్పంచు జమిలాబీ, ఎంపీటీసీ ముబీనా బేగం, మాజీ వైస్ ఎంపీపీ మహబూబ్ బాషా పాల్గొన్నారు.

పరిశుభ్రతను పాటించండి

కొత్తపల్లి: గ్రామీణ ప్రాంతాలలో ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను తప్పక పాటించాలని వైద్యాధికారి సౌజన్య లక్ష్మి, ఎంపీడీఓ మేరి సూచించారు. గురువారం ముసలిమడుగు గ్రామంలో మెడికల్ క్యాంపు నిర్వహించారు. గ్రామంలో ఓ వ్యక్తికి డెంగీ లక్షణాలు ఉన్నందున మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసి గ్రామస్తులకు మలేరియా, డెంగీ పరీక్షలు నిర్వహించారు. ఎవరికీ పాజిటివ్ కేసులు నమోదు కాలేదన్నారు.

భూ పోరాటాన్ని విజయవంతం చేయండి

ఆత్మకూరు: పాములపాడు మండలం కొత్త, పాత బానుకచర్ల, గూండాలమెట్టు గ్రామాల్లో ఈ నెల 7న నిర్వహిస్తున్న భూపోరాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా నంద్యాల జిల్లా కార్యదర్శి రంగనాయుడు పిలుపునిచ్చారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో గురువారం కార్యకర్తల సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ ఆయా గ్రామాల్లో ఇళ్లులేని నిరుపేదలకు సర్వేనెంబర్ 456/1 ఇళ్లపట్టాలను మంజూరు చేయాలన్నారు. బాబాఫకృద్దీన్, రాధాకృష్ణ, రమేష్‌బాబు, హుస్సేన్ పాల్గొన్నారు.

వెంకన్న దర్శనానికి భక్తులు



తిరుపతికి తరలివెళ్తున్న భక్తులు

ఆత్మకూరు: మండలంలోని అమలాపురం చెంచుగూడెం గిరిజనులు తిరుపతిలో వెలసిన శ్రీవేంకటేశ్వరస్వామి వైకుంఠ ద్వార దర్శనం కోసం తిరుమలకు గురువారం బయల్దేరారు. సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో 49 మంది భక్తులకు స్వామి వారి దర్శనం కల్పించనున్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ఆత్మకూరు సౌత్ సబ్‌డివిజన్ కన్వీనర్ మల్లెల హనుమంతరెడ్డి, టౌన్ కన్వీనర్ భానుమూర్తి, రాజగోపాల్‌రెడ్డి, రవీంద్రబాబు పాల్గొన్నారు.

మహానంది: సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేదలకు తిరుమల వెంకటేశ్వరస్వామి దర్శనం చేయిస్తున్నట్లు డివిజన్ ధర్మ ప్రచారక్ శివప్రసాద్ తెలిపారు. గాజులపల్లెలోని నూతనంగా నిర్మిస్తున్న సుంకులమ్మ ఆలయం వద్ద నుంచి భక్తులు గురువారం బస్సులో తిరుమలకు బయల్దేరి వెళ్లారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ రాజేశ్వరరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.